సాక్షి
ఏలూరు
గురువారం । 22 । జూన్ । 2023



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి బుధవారం సందర్శించారు.



ఉద్యాన వర్సిటీలో యోగా డే

తాడేపల్లిగూడెం: దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యమైందని ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ అన్నారు. వర్సిటీలో యోగా డేలో ఆయన పాల్గొన్నారు.



హతవిధీ.. ఇదేం శుద్ధి

శ్రీవారి సుదర్శన పుష్కరణిని ఆలయ సిబ్బందే కలుషితం చేస్తున్నారు. అధికారుల ఆదేశాలంటూ దేవస్థానం సత్రాల్లో వినియోగించే దుప్పట్లను అందులో ఉతుకుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ట్రిపుల్ ఐటీలో యోగా డే వేడుకలు



ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల యోగాసనాలు

నూజివీడు: యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని, తద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి రావడానికి మార్గం సులువవుతుందని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని యోగశాలలో బుధవారం యోగా డే నిర్వహించారు. దీనిలో భాగంగా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, సిబ్బంది కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం యోగా విద్యార్థులు వందేమాతరానికి ప్రదర్శించిన రిథమిక్ యోగా ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కేవీ రావు, ప్రొఫెసర్ హరినారాయణ, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, ఏవో ప్రదీప్, డీన్ అకడమిక్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జితో ట్రాఫిక్ రద్దీ నివారణ



భీమవరంలో రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్‌పవార్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం గరగపర్రు రోడ్డులో టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని బుధవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.22 కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీ వల్ల పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గుతుందన్నారు. సబ్ కా సాత్-సబ్ కా వికాస్ సూత్రంతో దేశం ముందడుగు వేస్తోందని సమ్మిళిత అభివృద్ధిని సులభతరం చేయడం ద్వారా నిజమైన స్ఫూర్తితో సహకార సమాఖ్యను నిర్ధారిస్తుందన్నారు. ముఖ్యమైన నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ వై.రవి కుమార్, రైల్వే అసిస్టెంటు డివిజనల్ ఇంజనీర్ శంకర రామాంజనేయులు, బీజేపీ నాయకులు పాకా సత్యనారాయణ, భూపతిరాజు శ్రీనివాసవర్మ, నార్ని తాతాజీ, అల్లూరి సాయిదుర్గరాజు, పేరిచర్ల సుభాష్, కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: కూర్మావతారంలో జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా శంకు, చక్ర, గదాధారియై కూర్మరూపంలో ఉన్న జగన్నాథ స్వామిని పలువురు భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి 1: 3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులు గురువారం సాయంత్రం 5 గంటల లోపు తమ సర్టిఫికెట్లతో ఏలూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులందరూ విధిగా స్కిల్ టెస్ట్, మోడల్ డెమో తరగతుల కోసం ఈ నెల 23, 24 తేదీల్లో హాజరుకావాలన్నారు. స్కిల్ టెస్ట్, మోడల్ డెమో తరగతులకు ఏలూరులోని రామకోటి వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ప్రజల వద్దకే వైద్యం

- శరవేగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు
- జిల్లాలో ఇప్పటికే 110 నిర్మాణాలు పూర్తి



జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

జంగారెడ్డిగూడెం: ప్రజారోగ్యానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు గ్రామస్థాయిలోనే క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. ప్రధానంగా పేదవారికి వైద్య సేవలన్నీ ఇంటి ముంగిటకే అందించాలని జగనన్న సర్కారు నిర్దేశించింది. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడకుండా గ్రామాల్లోనే వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూపకల్పన చేసింది. అవసరమైన సిబ్బంది నియమించేందుకు కసరత్తు చేసింది. తొలుత వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న భవనాలను ఏర్పాటు చేయడంతో పాటు లేని ప్రాంతాల్లో నూతనంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుండగా, కొన్ని గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం కూడా పూర్తయ్యింది.

లక్ష్యం దిశగా హెల్త్ క్లినిక్‌లు

హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యం అందించాలనే ప్రభుత్వ ధ్రుఢ సంకల్పం నెరవేర్చే దిశగా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ మొదలుకుని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ క్లినిక్‌ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 403 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 403 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు నిర్మించనున్నారు. ఈ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి తొలుత రూ.17.50 లక్షలు కేటాయించారు. మెటీరియల్ వ్యయం, కూలీ ఖర్చులు తదితర కారణాలతో ప్రభుత్వం మరో రూ.3.30 లక్షలు అదనంగా కేటాయించింది. దీంతో మొత్తం రూ. 20.80 లక్షలు వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణానికి కేటాయించారు.

ఏలూరు జిల్లాలో హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు

మొత్తం వైఎస్సార్ క్లినిక్ భవనాలు	403
పనులు పూర్తయినవి	110
బేస్‌మెంట్ లెవెల్ కింది స్థాయి	13
బేస్‌మెంట్ లెవెల్	88
రూఫ్ లెవెల్	82
శ్లాబ్ పూర్తయినవి	46
తుది దశలో ఉన్నవి	57

వేగవంతంగా నిర్మాణాలు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం వేగవంతం చేశాం. ప్రభుత్వం తాజాగా పెంచిన నిధులతో ఈ భవనం ఒక్కొక్కదానికి రూ. 20.80 లక్షలు ఖర్చవుతోంది. కొన్ని పనులు పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. బేస్‌మెంట్ స్థాయి నుంచి శ్లాబ్ వరకు నిర్మాణాలు పూర్తయిన భవనాలు సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నవి డిసెంబర్‌నాటికి పూర్తి చేయాలని నిర్ధేశించింది.

– కె.శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ, జంగారెడ్డిగూడెం

మురుగు కాల్వల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



డ్రెయిన్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీష్ కుమార్

సాక్షి, భీమవరం: మురుగు కాల్వల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ రేవు సతీష్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. జిల్లాలోని మేజర్ డ్రెయిన్ బొండాడ మురుగు కాలువ దుస్థితిని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై బుధవారం భీమవరం మండలం అనాకోడేరు, ఎల్‌వీఎన్ పురం గ్రామాలలో సతీష్ కుమార్ రైతులతో కలిసి పర్యటించారు. గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పాతపాటి మురళి రామరాజు మాట్లాడుతూ ఈ మురుగు కాలువ ఆయకట్టులో సార్వా పంట సమయంలో రైతులు నష్టపోతున్నారన్నారు. కిక్కిస బాగా పెరగడంతో రసాయనాలకు తూడు తొలగలేదన్నారు. చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానని, అంచనాలను తయారు చేయాలని సూచించారు.

తడిసి ముద్దయిన ఏలూరు



ఉక్కపోతతో అల్లాడుతున్న నగర ప్రజలకు బుధవారం సాయంత్రం ఉపశమనం కలిగింది. పగలంతా ఉక్కపోతతో కూడిన వాతావరణంతో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం చల్లగాలులతో వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం 7 గంటలు దాటిన తరువాత ఉరుములతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. ఏలూరులో కురిసిన వర్షానికి సంబంధించి కొన్ని చిత్రాలు ఇవి. - సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో భూమి రీ సర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు ప్రసన్న వెంకటేష్ కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశం మందిరం నుంచి సబ్ కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, వివిధ శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హైకోర్టుకు సంబంధించిన ప్రభుత్వ శాఖల కేసులు, ఏఎస్ఎంల ఫీడ్ బ్యాక్, ఎన్సీడీ సర్వే, ముఖ ఆధారిత హాజరు అమల, జిల్లాలోని కంటి వెలుగు ఆపరేషన్ నివేదిక, విద్యా కానుక నివేదిక, వైఎస్సార్ బీమా, జగనన్నకు చెబుదాం అంశాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్‌మూర్తి, ఏడీ సర్వే వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ నరసింహరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఆశా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమా పోస్టర్ విడుదల

బుధవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ పశు బీమా పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్టపరిహార పథకం స్థానంలో దీన్ని అమలు చేస్తున్నారన్నారు. బీమా పథకంలో గరిష్ఠంగా ఒక్కో కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలను బీమా కింద నమోదు చేసుకోవచ్చన్నారు. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే పశువులు, గేదెలకు మూడేళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూబాబు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.ముస్తఫాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి

అత్తిలి: రీ సర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అత్తిలి మండలం మంచిలిలో జరుగుతున్న రెండో దశ రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ రామసుందరరెడ్డి మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని మొత్తం భూమిని ఖచ్చితత్వంతో రీసర్వే చేసి ల్యాండ్ రికార్డులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

యాసిడ్ దాడికి గురైన మహిళ మృతి

- మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత
- హత్య కేసు నమోదు చేసిన పోలీసులు



ఫ్రాన్సిక (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు గ్జేవియర్ నగర్ మోనాస్ట్రీ ప్రాంతంలో ఉంటున్న యడ్ల ఫ్రాన్సికపై ఈనెల 13న ఇద్దరు వ్యక్తులు యాసిడ్ దాడికి పాల్పడగా.. బాధితురాలు గుంటూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఆమె స్వగ్రామం దెందులూరుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో కేసును హత్య కేసుగా మారుస్తూ పోలీసుల కేసు నమోదు చేశారు. ఈ కేసును సెక్షన్ 302, 120(బీ), 341, 326-ఏ, రెడ్‌విత్ 34 ఐపీసీ అండ్ సెక్షన్3(2)(4) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) యాక్ట్ 1989 అండ్ సెక్షన్ 6(1) ఆఫ్ పాయిజన్ యాక్ట్ -1919 కింద కేసు నమోదు చేశారు. కేవలం 15 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన తర్వాత బాధితురాలిని మెరుగైన వైద్యానికి విజయవాడ జీజీహెచ్, ఆధునిక వైద్యచికిత్సకు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి ఎంత ఖర్చయినా భరించి మంచి వైద్యచికిత్స అందించాలని తీవ్రంగా శ్రమించారు. యాసిడ్ తీవ్రస్థాయిలో ప్రభావం చూపడంతో మృత్యువుతో పోరాడిన ఫ్రాన్సిక చివరికు ఓడిపోయింది.

కాళ్లు పట్టుకున్నా మంచినీటి కుళాయి ఇవ్వనూ..

చాట్రాయి మండలంలో టీడీపీ సర్పంచ్ నిర్వాకం ఇది

చాట్రాయి: 'నువ్వు, నీ కుటుంబ సభ్యులు నా ఇంటి చుట్టూ తిరిగినా, చివరకు నా కాళ్లు పట్టుకున్నా నీకు మంచి నీటి కుళాయి ఇవ్వను. నీకు చేతనైంది చేసుకో' అంటూ సర్పంచ్ పరుష పదజాలంతో తమని దూషించాడని పాస్టర్ మరపాక విజయరావు అవేదన వ్యక్తం చేశారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి తాగునీటి కుళాయి ఇవ్వండి అని అనేకసార్లు అడిగినా పట్టించుకోకుండా ఇష్టానురీతిలో సర్పంచ్ మాట్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాట్రాయి మండలం టీడీపీ నేత, కృష్ణారావుపాలెం సర్పంచ్ చిమటబోయిన పుల్లారావు చేసిన నిర్వాకం . దీనిపై అదే గ్రామానికి చెందిన పాస్టర్ మరపాక విజయరావు బుధవారం చాట్రాయి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో కుళాయి మంజూరు చేయాలంటూ సర్పంచ్‌ని అడగ్గా నీకు కుళాయి ఇవ్వనని నా కాళ్లు పట్టుకున్నా సరే నేను సర్పంచ్ పదవిలో ఉన్నంత వరకూ నీటి మంచినీటి కుళాయి ఇవ్వనని మాట్లాడారని వివరించారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజుని అడగ్గా నేటి వరకు కుళాయి మంజూరు చేయలేదని ఆయన అన్నారు. సర్పంచ్ తమపై కక్షసాధింపుతో కుళాయి మంజూరు చేయడంలేదని దయచేసి కుళాయి మంజూరు చేయాలంటూ మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీ మోహనరావుకి వినతి పత్రం అందచేశారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీ మోహనరావు మాట్లాడుతూ ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజీంద్రన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని అన్నారు.

24 గంటలూ విద్యుత్ సరఫరా

విద్యుత్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అక్కౌంట్స్ సిబ్బందితో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, కొత్త సర్వీసులన్నీ వెంటనే విడుదల చేయాలని, లైన్ లాస్‌లను తగ్గించాలని, విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని సూచించారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో విద్యుదీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోకుండా విద్యుత్ శాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రెండు నెలల్లోనే సబ్‌స్టేషన్ నిర్మాణం

74 ఎకరాల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ కాంతులు



తాళ్లకోడులోని జగనన్న కాలనీలో 33 కేవీ సబ్‌స్టేషన్ ట్రయిల్ రన్

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. కాలనీ నడిబొడ్డున రూ.3.72 కోట్ల వ్యయంతో 33 కేవీ/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గతంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శంకుస్థాపన చేశారు. కేవలం రెండు నెలల్లోనే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యింది. గత ప్రభుత్వాల హయంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలంటే ఏళ్లు గడిచినా మోక్షం లభించేంది కాదు. ఒక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ వేయాలంటేనే రెండు మూడేళ్లు పట్టేది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేశారు. సబ్ స్టేషన్ పనులు పూర్తి కావడంతో రెండు రోజులుగా ట్రయిల్ రన్ వేశారు. దీంతో కాలనీలోని 3,600 ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులకు మాత్రమే నాణ్యమైన విద్యుత్ అందుతుంది. జగనన్న కాలనీలోని పలు వీధుల్లో 580కి పైగా విద్యుత్ స్తంభాలు, 40 వరకూ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. కాలనీ వాసులకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ఇళ్లు నిర్మించుకుని, గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారుల ఇళ్లలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. ప్రస్తుతం ఇళ్లు నిర్మిస్తున్న వారికి కూడా విద్యుత్ సరఫరా పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. జగనన్న కాలనీలో వసతులు రావడంతో లబ్ధిదారుల్లో ఆనందం, ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

డీఈఎల్ ఈడీ పరీక్షలకు 166 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్ ఈడీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 2వ సెమిస్టర్ పరీక్షలకు నూరు శాతం మంది హాజరు కాగా, మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 74 మందికి 18 మంది హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ తెలిపారు.

సమగ్ర శిక్ష ఇన్‌స్ట్రక్టర్స్ బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, భీమవరం: జిల్లాలోని సమగ్రశిక్షలోని వివిధ ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల బదిలీల కోసం ఈనెల 24లోపుగా సమగ్రశిక్ష కార్యాలయం భీమవరంలో దరఖాస్తులు అందచేయాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బదిలీల కోసం దరఖాస్తులు ఏలూరు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందచేయాలన్నారు.

చికిత్స పొందుతూ వలంటీర్ మృతి


రామాంజనేయులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్ : వాహనంపై వెళుతూ అనారోగ్యంతో అకస్మాత్తుగా కుప్పకూలిన వలంటీర్ రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పంగిడిగూడెం గ్రామ వలంటీర్ కుక్కల రామాంజనేయులు (29) ఈనెల 14న జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుంచి పంగిడిగూడెకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పంగిడిగూడెం హైస్కూల్ వద్దకు వచ్చే సరికి వాహనం నుంచి ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి అతనిని జంగారెడ్డిగూడెం తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బీపీ ఎక్కువైందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు వీఆర్వో తెలిపారు.

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ.11.23 లక్షలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీలోని కానుకలను బుధవారం లెక్కించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 87 రోజులకు గాను స్వామివారికి రూ.11,23,794 ఆదాయం వచ్చింది. ఏసీ నేల సంధ్య మాట్లాడుతూ అలాగే 2 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించినట్లుగా చెప్పారు.

విత్తనాల దుకాణంపై కేసు నమోదు

కొయ్యలగూడెం: వరి విత్తనాల దుకాణంలో స్టాక్ నిల్వలో వ్యత్యాసాలపై కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు బుధవారం చెప్పారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు సీఐ యూజే విల్సన్ కొవ్వూరు రోడ్డులో ఉన్న దుకాణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రిజిస్టర్‌లో నమోదు చేసి వరి విత్తనాలకు, దుకాణంలో ఉన్న స్టాకుకు తీవ్ర వ్యత్యాసం ఉందని గుర్తించారు. దీనిపై దుకాణం యజమానిపై 6(ఎ) కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

చింతలపూడి: దేశవరంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సాయి స్వరూప్ చెప్పారు. కనిపెడ రవికుమార్‌ను అరెస్టు చేసి, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే ఎద్దు ప్రేమ్‌చంద్‌ను అరెస్టు చేసి, 30 లీటర్ల సారా, ఒక బైక్, 600 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. మరో వ్యక్తి ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

హతవిధీ.. ఇదేం శుద్ధి

- శ్రీవారి పుష్కరిణిని దేవస్థానమే కలుషితం చేస్తున్న వైనం
- దేవస్థానం సత్రాల్లో దుప్పట్లను దీనిలో ఉతికేస్తున్న సిబ్బంది
- అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు, భక్తులు



పుష్కరిణిలో దుప్పట్లను ఉతుకుతున్న దేవస్థానం సిబ్బంది, పరిశుభ్రంగా ఉంచాలని ఏర్పాటు చేసిన బోర్డు

ద్వారకాతిరుమల: శ్రీవారి సుదర్శన పుష్కరిణి (నృసింహ సాగరం)ని పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆలయ సిబ్బందే కలుషితం చేస్తున్నారు. ఎంతో పవిత్రంగా చూడాల్సిన పుష్కరిణిలో అధికారుల ఆదేశాలంటూ దేవస్థానం సత్రాల్లో వినియోగించే దుప్పట్లను ఉతుకుతున్నారు. దీంతో ఆలయ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. వివరాల ప్రకారం.. శ్రీవారి సుదర్శన పుష్కరణిలో ఏటా కార్తీకమాసంలో క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం రోజు స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం సందర్భంగా ఇందులో విహరిస్తారు. అయితే శ్రీవారి సుదర్శన పుష్కరిణి ఇప్పటికే తామరతూడు, చెత్తా, చెదారంతో నిండింది. తెప్పోత్సవ సమయంలో మాత్రమే ఆలయ అధికారులు ఈ పుష్కరిణిపై దృష్టి సారిస్తారు. పరిసరాలను శుభ్రం చేస్తారు. అలా కాకుండా శ్రీవారు విహరించే పుష్కరిణిని నిత్యం ఎంతో పవిత్రంగా ఉంచాల్సిన బాధ్యతను ఆలయ అధికారులు విస్మరిస్తున్నారు. ఈ పుష్కరిణిని పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, అభివృద్ధి చేయాలని స్థానికులు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా అందులో బట్టలు ఉతకకూడదని, అలాగే పశువులు దిగకుండా చూడాలని వారికి సలహాలిచ్చేవారు. అయితే తాజాగా బుధవారం ఆలయంలో పనిచేసే స్వీపర్లు సత్రాల్లోని బెడ్ షీట్లను పుష్కరిణిలో ఉతకడం ఆ ప్రాంత వాసులను కంగుతినేలా చేసింది. నీతులు చెప్పడమే గానీ.. అధికారులు ఆచరించరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వాషింగ్ మెషీన్ మరమ్మతుల వల్లే..

స్వీపర్లతో ఇలాంటి పనులు చేయించడం, బురద నీటిలో బెడ్‌షీట్లను ఉతికించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే ధర్మఅప్పారాయ నిలయం (120 గదుల సత్రం)లోని వాషింగ్‌మెషీన్ మరమ్మతులకు గురవడంతో పుష్కరిణిలో బెడ్‌షీట్లు ఉతికిస్తున్నట్లు అక్కడున్న సూపర్‌వైజర్ చెబుతున్నాడు. ఇదిలా ఉంటే చెప్పిన పనులు చేయకపోతే విధుల నుంచి తొలగిస్తామని పారిశుధ్య కార్మికులను కొందరు బెదిరిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరిణి పవిత్రతను కాపాడాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు బుధవారం చెప్పారు. పట్టణంలోని ఓ మహిళను కొండేటి సురేష్ అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు సురేష్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పవన్ కల్యాణ్‌కు రాజకీయ పరిణితి లేదు

ఏలూరు (మెట్రో): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక మతిభ్రమించిన వ్యక్తి మాదిరిగా పచ్చని గోదావరి జిల్లాల్లో పర్యటిస్తూ కుల చిచ్చు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ గోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పవన్‌కు దిశా, దశ, మార్గనిర్దేశం లేదన్నారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్ పరిణితి చెందాల్సి ఉందన్నారు. ఇప్పటికే కులాలతో మన రాష్ట్రాన్ని తెలుగుదేశం భ్రష్టు పట్టించిందన్నారు. దానికి పవన్‌కల్యాణ్ ఆజ్యం పోస్తున్నారన్నారు. ముద్రగడ పద్మనాభం రాసిన లేఖలో పేర్కొన్నట్టు పవన్ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి అవుతానని కలలు కంటున్న పవన్ కేవలం ఒక కులానికి పరిమితమయ్యేలా మాట్లాడటం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో సమాజంలోని బలహీన, అట్టడుగు వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నిర్మాణాత్మక విమర్శలు చేస్తే ప్రజలు ఆహ్వానిస్తారన్నారు. పవన్ తన భాషను మార్చుకోవాలని, రాజకీయాల్లో పైకి రావాలంటే క్యారెక్టర్ ముఖ్యమని, ప్రజలు క్యారెక్టర్‌ని గమనిస్తారన్నారు. పవన్ తన హావభావాలు, వికృతి చేష్టలను మార్చుకోవాలని ఘంటా ప్రసాదరావు అన్నారు.

చదివిన స్కూల్‌కే టీచర్లుగా..


బదిలీపై వచ్చిన ఆరుగురు ఉపాధ్యాయినులు వీరే

నూజివీడు: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలోనే పాఠాలు బోధించే అవకాశం లభించడం అరుదు. ఇలాంటి అవకాశం ఒకరిద్దరికి కాదు ఏకంగా ఆరుగురికి లభించింది. దీనికి నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ వేదికగా నిలిచింది. ఇదే పాఠశాలలో ఒకప్పుడు విద్యార్థులుగా చేరి, నాటి తమ ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు శ్రద్ధగా చదువుకుని, టీచర్ ఉద్యోగాలు సాధించి ఇప్పటివరకు ఎక్కడెక్కడో పనిచేసి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఆరుగురు టీచర్లు తాము చదువుకున్న పాఠశాలకు వచ్చారు. వీరిలో బీ జానకీబాయ్ (హిందీ), పీ స్వర్ణలత (సోషల్), పిల్లి వరలక్ష్మి (గణితం), జీ భారతి (తెలుగు), టీ పద్మశ్రీవల్లి (గణితం), ములగలేటి ఉమా (ఇంగ్లిష్) ఉన్నారు. తమకు తమ గురువులు ఏ విధంగా పాఠాలు బోధించి ప్రయోజకులుగా చేశారో తాము కూడా అదే విధంగా పాఠాలు బోధిస్తూ విద్యార్థినులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతామని చెబుతున్నారు. చదువుకున్న పాఠశాల్లోనే ఉపాధ్యాయులుగా పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని వారు చెబుతున్నారు.

గడపగడపకు సంక్షేమం


పెదవేగి : లక్ష్మీపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి